సాక్షి
శ్రీకాకుళం

బుధవారం ◆ 25 ◆ డిసెంబర్ ◆ 2024



ప్లాన్ చేసి.. పట్టుబడి

జిల్లా కేంద్రంలో జరిగిన దోపిడీయత్నం కేసును పోలీసులు ఛేదించారు. నిందితులను పట్టుకున్నారు.

- 10లో



మనోభావాలు పట్టవా..?

ఎయిర్‌పోర్టు మీద ప్రజాగ్రహంపై మాజీ మంత్రి సీదిరి స్పందించారు. తనపై విమర్శలు చేయడం సరికాదన్నారు.

- 10లో

డిగ్రీ బ్యాక్ లాగ్ విద్యార్థులకు స్పెషల్ డ్రైవ్ పరీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో డిగ్రీ సెమిస్టర్ బ్యాక్ లాగ్ విద్యార్థుల కోసం స్పెషల్ డ్రైవ్ పరీక్ష నిర్వహించనున్నట్లు యూజీ ఎగ్జామినేషన్స్ డీన్ జి.పద్మారావు మంగళవారం చెప్పారు. డిగ్రీ 2015, 16.17.18 ఏళ్లల్లో చదివిన విద్యార్థులకు 1, 3, 5 సెమిస్టర్లతో స్పెషల్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించ నున్నట్లు చెప్పారు. జనవరి 18వ తేదీ లోపు ఫీజు చెల్లించాలని, ఫిబ్రవరి మొదటి వారంలో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

జెమ్స్‌లో చిన్న పిల్లలకు ఉచిత వైద్య సేవలు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చిన్న పిల్లలకు ఉచిత వైద్య సేవలను బుధవారం నుంచి అందిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 0–5 సంవత్సరాల్లోపు పిల్లలకు ఈ నెలలో జలుబు, దగ్గు, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు, న్యూమోనియా, ఆస్తమా, వైరల్ ఇన్‌ఫెక్షన్లు, జీర్ణకోశ వ్యాధులు, చెవి ఇన్‌ఫెక్షన్లు వంటివి తరచుగా వస్తుంటాయని అలాంటి పిల్లలకు ఉచితంగా జెమ్స్‌లో ప్రత్యేకమైన చికిత్స అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరిన్ని వివరాలకు 7680945332 అనే నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ధరల పెంపే మీ విజనా..?



విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన కార్యక్రమ గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి రాగానే ఏకంగా రూ.15,450 కోట్ల మేరకు ప్రజలపై భారం వేశారని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ధ్వజమెత్తారు. ధరల పెంపే మీ విజనా అని సూటిగా ప్రశ్నించారు. విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ ఈ నెల 27న నియోజకవర్గ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ పోరుబాట నిర్వహిస్తుందని అన్నారు. నరసన్నపేట పార్టీ కార్యాలయంలో ఆయన మంగళవారం దీనికి సంబంధించిన గోడ పత్రిక విడుదల చేశారు.

నమ్మించి మోసం చేశారు..

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం కోసం కూటమి నాయకులు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చారని, అధికారం దక్కాక ఆ మాటలన్నీ మర్చిపోయారని అన్నారు. జిల్లాలో విద్యుత్ వినియోగదారులపై నెలవారీగా సుమారుగా రూ. 10 కోట్లు పైనే ఈ భారం ఉండనుందని తెలిపారు. ప్రజలను నమ్మించి మోసం చేయడం టీడీపీ నాయకులకు అలవాటేనని అన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక పాలనపై సామాన్యుల గొంతుక వినిపించేందుకే వైఎస్సార్‌సీపీ ఈ విధంగా నిరసన, పోరుబాట కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో నరసన్నపేట, జలుమూరు ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు ముద్దాడ బైరాగి నాయుడు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.





శ్రీకాకుళంలోని క్రిస్టియన్ వర్షిప్ సెంటర్‌లో ప్రార్థనలు

క్రీస్తు ఆగమన వేళ..

ధ్రువతార విశ్వాసకుల ఇళ్ల మీద వెలుగులు విరజిమ్మింది. క్రిస్మస్ చెట్టు ఆరాధకుల ఇంటి వాకిట అందంగా నిలబడింది. పశువుల పాకలు లోక రక్షకుడికి స్వాగతం పలుకుతూ ప్రార్థనా మందిరాల్లో కొలువుదీరాయి. కరుణామయుడి రాక కోసం క్రీస్తు మందిరాలు సుందరంగా ముస్తాబయ్యాయి. మంగళవారం రాత్రి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

– శ్రీకాకుళం కల్చరల్

కష్టాలు రియల్



- కొత్త ఏడాదిలో రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు
- ఎన్నడూ లేని విధంగా అమాంతంగా ధరల పెంపు
- కిక్కిరిసిపోతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- పనిచేయని సర్వర్లు
- ఇబ్బందుల్లో రిజిస్ట్రేషన్ దారులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

ఒకటో తేదీ వస్తుందంటే రియల్టర్లు బెదిరిపోతున్నారు. నూతన సంవత్సరం నాటి నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచేందుకు గత నెల రోజులుగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ధరల పెంపుపై రియల్టర్లకు సమాచారం వస్తూనే ఉంది. కొత్త సంవత్సరంలో కొత్త ధరలు వస్తాయని తెలియడంతో వారు లబోదిబోమంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రియల్ వ్యాపారం పూర్తిగా కుదేలైందని రియల్టర్లు, భూ యజమానులు చెబుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 30 నుంచి 40శాతం పెంచడం ఇదే మొదటి సారి. అంతేకాకుండా ఎప్పుడు ధరలు పెంచినా ఆయా ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులను పరిగణలోకి తీసుకోవడం, ఆయా సబ్‌రిజిస్ట్రార్ల సలహాలు, సూచనలు పాటించడం ఆనవాయితీ.

ఈ ఏడాది మాత్రం అవేమీ తమకు అవసరం లేదన్నట్లు ధరలు పెంచడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిర్ణయించుకుంది. అధికారం చేపట్టినప్పటి నుంచి నిత్యావసరాలు, విద్యుత్ చార్జీలు, పెట్రోలు, నూనె, చికెన్, కూరగాయలు ధరలతో పాటు చివరికి భూములు ధరలు సైతం పెంచేశారు. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే ధరలు పెంచబోమని ఎవ్వరు భయపడవద్దని ప్రతి రోజూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక తమకు నచ్చినట్లు అన్ని రకాలు ధరలు పెంచేశారు.



కిక్కిరిసిపోయిన శ్రీకాకుళం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

వైఎస్సార్ సీపీ హయాంలో 10 శాతమే పెంపు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2019లో కేవలం 10 శాతం మాత్రమే ధరలు పెంచారు. ఈ ఏడాది మాత్రం ఎవరూ ఊహించని రీతిలో 30 నుంచి 40 శాతం పెంచేందుకు నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. 2019లో ఆగస్టులో ధరలు పెంచినా 10శాతం (సీలింగ్) మాత్రమే పెంచారు. ప్రభుత్వ నిబంధనలు, పాత విధానాలు తమకేం పట్టనట్లు ఏకంగా భారీగా భూముల ధరలు, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. నామమాత్రంగా ఒక కమిటీ వేసినా ఆయా కమిటి నిర్ణయాలు పట్టించుకునే పరిస్థితులు లేనట్లే కనిపిస్తోంది.

కిక్కిరిసిపోతున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు

జిల్లా వ్యాప్తంగా 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. దాదాపుగా గత వారం రోజులుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నిండా కొనుగోలు, అమ్మకందారులతో నిండిపోతోంది. ప్రజలంతా ఒక్కసారిగా రిజిస్ట్రేషన్లు చేయించుకోవడంతో సిబ్బంది తగిన సేవలు అందించలేకపోతున్నారు. అంతేకాకుండా ఒక్కసారిగా ప్రజలంతా రావడంతో వేగంగా పని చేసే ప్రయత్నంలో భాగంగా తప్పులు దొర్లే అవకాశం ఉంటుంది. డాక్యుమెంట్లు క్షుణ్ణంగా పరిశీలించేంత సమయం కూడా ఉండడం లేదు. దీంతో కొనుగోలు, అమ్మకందారులకు భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పకపోవచ్చు. దీనికి సాంకేతిక పరమైన సమస్యలు వస్తున్నాయి. ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులేమి పట్టించుకోకుండా కేవలం ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని మాత్రమే చూసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

హెచ్‌ఎం, ప్రిన్సిపాల్ సెలవుపై వెళ్లండి

శ్రీకాకుళం న్యూకాలనీ, జలుమూరు: విద్యార్థులకు ఆదర్శంగా ఉండాల్సిన గురువులే పల్చనవుతుండటం సరికాదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లాలోని జలుమూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, జలుమూరు జూనియర్ కళాశాల ప్రాంగణంలో పనులు, చెట్ల నరికివేత పంచాయతీ మంగళవారం రాత్రి కలెక్టర్ వద్దకు చేరింది. డీవీఈఓ ఎస్.తవిటినాయుడు, డీఈఓ డాక్టర్ ఎస్. తిరుమల చైతన్య, జలుమూరు హెచ్‌ఎం, ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు హాజరయ్యారు. ఇరు విద్యాసంస్థల వాదనలు విన్న కలెక్టర్ హెచ్‌ఎం, ప్రిన్సిపాల్‌ను నెలరోజులపాటు సెలవు తీసుకోవాలని ఆదేశించారు. అక్కడి వాస్తవ పరిస్థితులను తెలియజేస్తూ ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ శివ్వాల తవిటినాయుడును నెలరోజుల్లో నివేదికను తన ముందుంచాలన్నారు. నివేదిక ఆధారంగా కచ్చితంగా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ స్పష్టం చేశారు.

విజయసాయిరెడ్డిని కలిసిన జిల్లా నాయకులు



ఎంపీ విజయసాయిరెడ్డిని కలిసిన జిల్లా ముఖ్య నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డిని విశాఖపట్నంలో ఆయన నివాసంలో మంగళవారం శ్రీకాకుళం జిల్లా ముఖ్య నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారితో విజయసాయిరెడ్డి మాట్లాడుతూ కలసికట్టుగా పార్టీని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఆగడాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. విజయసాయిరెడ్డిని కలిసినవారిలో వైఎస్సార్‌సీపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, మాజీ ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్‌కుమార్, పిరియా సాయిరాజ్, టెక్కలి, ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్తలు పేరాడ తిలక్, చింతాడ రవికుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, కళింగవైశ్యకుల రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, గేదెల పురుషోత్తం, ఖండాపు గోవిందరావు తదితరులు ఉన్నారు.

మృత్యుదారిపై రుధిర ధార





ఐదువందల పైచిలుకు కిలోమీటర్ల దూరం. జాతీయ రహదారిపై కారులో నిమ్మళంగా వెళ్తే దాదాపు పది గంటల సేపు ప్రయాణం. అప్పటికే వారు దాదాపు సగం దూరం ప్రయాణం పూర్తి చేశారు. ఇంకాసేపైతే ఆంధ్రాపరిధి దాటి ఒడిశాలోకి ప్రవేశిస్తారు. కానీ అక్కడే వారి ప్రయాణం ఆగిపోయింది. అంతసేపు కారు నడిపిన బడలిక.. అతి వేగం.. నిద్రమత్తు కలగలిపి వారి జీవిత ప్రయాణాన్ని ఆపేశాయి. అదుపు తప్పిన వారి కారు జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్‌స్తంభాన్ని ఢీకొంటే.. ఆ ధాటికి స్తంభం ఏకంగా విరిగిపోయింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. కూతురికి ఐఐటీలో సీటు వచ్చిందని మొక్కు తీర్చుకోవడానికి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది.

- కంచిలి సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం
- మొక్కు తీర్చుకోవడానికి వెళ్తుండగా దుర్ఘటన
- మృతులు విశాఖ వాసులు



కారులో మృతురాలు లావణ్య



తీవ్రగాయాలపాలైన కదిరిశెట్టి రాధిక



కారు ఢీట్టడంతో విరిగిపోయిన విద్యుత్ స్తంభం

కంచిలి: కంచిలి మండల పరిధి పెద్దకొజ్జిరియా–చిన్నకొజ్జిరియా గ్రామ కూడళ్ల మధ్యలో మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతి వేగంతో వచ్చిన కారు అదుపు తప్పి, రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నేహా గుప్తా(18), కదిరిశెట్టి సోమేశ్వరరావు(49), లావణ్య(43) దుర్మరణం పాలయ్యారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరంతా విశాఖకు చెందిన వారు. వివరాల్లోకి వెళ్తే..

మొక్కు తీర్చుకుందామని..

విశాఖలోని సీతమ్మధారకు చెందిన ముత్తా వెంకట రంగ రాజేష్ భార్య లావణ్య, కుమార్తె నేహా గుప్తా, తల్లి సుబ్బలక్ష్మితోపాటు తెలంగాణ రాష్ట్రం భద్రాచలానికి చెందిన తోడల్లుడు కదిరిశెట్టి సోమేశ్వరరావు, ఆయన భార్య రాధికలతో కలిసి కారులో ఒడిశా రాష్ట్ర పరిధి జాజ్‌పూర్‌లో గల గిరిజామాత అమ్మవారి దర్శనానికి బయల్దేరారు. నేహా గుప్తాకు ఐఐటీలో సీటు రావడంతో మొక్కు తీర్చుకోవడానికి తమ కారులోనే బయల్దేరారు. ఉదయం 9 గంటల సమయంలో కంచిలి మండలం చిన్నకొజ్జిరియా గ్రామకూడలి వద్దకు వచ్చేసరికి వాహనాన్ని నడుపుతున్న ముత్తా వెంకటరంగరాజేష్ నిద్ర మత్తులోకి జారుకున్నాడు. దీంతో వాహనం అదుపు తప్పి, రోడ్డు పక్కన బెర్మ్‌వైపు దిగి ఆ పక్కన ఉన్న 33 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో కారు పూర్తిగా అదుపు తప్పి మళ్లీ రోడ్డు మీదకు చేరి పల్టీలు కొడుతూ మరికొంత దూరం వెళ్లిపోయి బోల్తాపడింది. కారు ఢీకొన్న వేగానికి విద్యుత్ స్తంభం ఏకంగా విరిగిపోయింది.

ప్రమాదంలో వాహనం నడుపుతున్న ముత్తా వెంకట రంగ రాజేష్ భార్య లావణ్య(43) కారులో నలిగిపోయి అక్కడికక్కడే చనిపోయారు. కుమార్తె నేహా గుప్తా(18), తోడల్లుడు కదిరిశెట్టి సోమేశ్వరరావు(49)లను స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో కన్నుమూశారు. మృతుడు సోమేశ్వరరావు భార్య కదిరిశెట్టి రాధిక తీవ్ర గాయాలపాలవ్వడంతో పరిస్థితి విషమించింది. దీంతో ఆమెను శ్రీకాకుళంలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వాహనం నడుపుతున్న వ్యక్తి వెంకట రంగ రాజేష్‌తోపాటు ఆయన తల్లి సుబ్బలక్ష్మిలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వీరికి సోంపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.



ప్రమాద పరిస్థితిని తెలుసుకుంటున్న కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు

మృతుడు కదిరిశెట్టి సోమేశ్వరరావు భద్రాచలంలో ఐటీసీ పేపర్ ఇండస్ట్రీలో ఉద్యోగి. ఆయనకు భార్య రాధిక, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యాభర్తలు సోమవారం రాత్రి విశాఖపట్నం చేరుకున్నారు. అంతా కలిసి మంగళవారం వేకువజామున ఒడిశాలోని గుడికి బయల్దేరారు. ఇక రాజేష్ విశాఖపట్నంలో ఆటోమొబైల్ స్పేర్‌పార్ట్స్ వ్యాపారం చేస్తుంటారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకొని పరామర్శకు వచ్చిన బంధువులకు చెబుతూ గుండెలు బాదుకుంటూ రోదించారు. నేహా పుట్టిన రోజు వేడుకలు ఈ నెల 21నే నిర్వహించారు.

అధికారుల పరిశీలన..

ప్రమాదం విషయాన్ని తెలుసుకొని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు, స్థానిక తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్‌లు సంఘటన స్థలంతోపాటు, ఆస్పత్రికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్ఐ పి. పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదం విషయం తెలుసుకొని సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ సోంపేట ప్రభుత్వాసుపత్రికి వచ్చి వెంకట రంగ రాజేష్‌ను పరామర్శించారు. ప్రమాద విషయాన్ని అడిగి తెలుసుకొన్నారు.

హాహాకారాలు..

ప్రమాదంలో ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందడంతో తీవ్ర విషాదం చోటుచేసుకొంది. ప్రమాదం జరిగిన ప్రదేశమంతా బాధి తుల ఆర్తనాదాలతో మార్మోగింది. జాతీయ రహదారిలో వాహన రాకపోకలు జరుగుతున్న సమయంలో ఈ ప్రమాదం జరగడం, ఆ సమయంలో మరే వాహనం రాకపోవడంతో కుడివైపు ఉన్న ముగ్గురు గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో కారులో మూడు వరుసల్లో సీట్లలో ఆరుగురు కూర్చుండగా, ఎడమవైపు విద్యుత్ స్తంభం ఢీకొనడంతో ఆ వైపు కూర్చున్న వారంతా ప్రమాదానికి గురయ్యారు. మరోవైపు కూర్చున్న ముగ్గురు గాయాలతో బయటపడినట్లు సంఘటన స్థలంలో ప్రమాద స్థలంలో పరిస్థితిని చూస్తే అర్థమవుతుంది.



బంధువుల వద్ద రోదిస్తున్న బాధితుడు వెంకట రంగ రాజేష్, తల్లి సుబ్బలక్ష్మి

నవంబరు 30 — విజయనగరం జిల్లా భోగాపురం వద్ద హైవేపై మితిమీరిన వేగంతో వెళ్తున్న కారు అదుపు తప్పి డివైడర్ ఎక్కించి ఆవలి రోడ్డు వైపునకు వెళ్లి లారీని ఢీకొనడంతో నలుగురు జిల్లావాసులు దుర్మరణం చెందారు.

డిసెంబర్ 5 — మెళియాపుట్టి మండలం చినహంస సమీపంలో ధాన్యపు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ఎడ్జ్‌లో ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ఓ యువకుడు, బాలిక మృతిచెందారు.ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. ద్విచక్రవాహనంపై నలుగురు వెళ్లడం గమనార్హం..



డిసెంబర్ 18 — కోటబొమ్మాళి మండలం పాకివలస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు సంపతి రావు త్రివేణి(30) మృతి చెందారు.

డిసెంబర్ 8 — తమిళనాడు నుంచి జార్ఖండ్‌కు వెళ్లేందుకు కొబ్బరి కాయల లోడుతో వస్తున్న లారీ ఎచ్చెర్ల ఫరీదుపేట కొయ్యరాళ్ల కూడలి వద్ద విద్యుత్తు స్తంభాన్ని (టవర్‌ను) బలంగా ఢీకొట్టి ఆగిపోయింది. క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ మృతిచెందగా వెనుక నిద్రిస్తున్న క్లీనర్ ప్రాణాలతో బయటపడ్డాడు.

క్లుప్తంగా

విజిలెన్స్ కమిటీ మెంబర్‌గా దాసరి



నియామకపత్రాన్ని అందుకుంటున్న తిరుమలరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యుడిగా దాసరి తిరుమలరావు మాదిగను ఎంపిక చేస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామక పత్రాన్ని సోషల్ వెల్ఫేర్ ఆఫీసులో తిరుమలరావుకి అందించారు. దీంతో తిరుమలరావు మాదిగకు పలువురు అభినందనలు తెలిపారు.

గోమాతలకు గ్రాసం కరువు



పశుగ్రాసం లేని గో సంరక్షణ కేంద్రంలో ఉన్న ఆవులు

టెక్కలి రూరల్: స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సమీపంలో ఏర్పాటు చేసిన గో సంరక్షణ కేంద్రంలో పశుగ్రాసం కొరత ఏర్పడింది. మంగళవారం గో శాలలో పశుగ్రాసం లేక అక్కడి గోమాతలు ఆకలితో అలమటించాయి. కేంద్రంలో సుమారు 10కి పైగా ఆవులు ఉండగా వాటిని తినేందుకు గ్రాసం లేక అక్కడ కుండీలలో ఏర్పాటు చేసిన నీటినే తాగుతున్నాయి. వర్షానికి ఉన్న గడ్డికి కూడా కుళ్లిపోయింది. అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయమై టెక్కలి పంచాయతీ కార్యదర్శి జగన్నాథం వద్ద వివరణ అడుగగా రెండు రోజులుగా వర్షాలు పడుతుండటంతో రైతులు వరిగడ్డి ఇవ్వలేదని వెంటనే ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో డిగ్రీ ఐదో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలను మంగళవారం అండర్ గ్రాడ్యుయేషన్ ఇన్‌చార్జి ఎగ్జామినేషన్స్ డీన్ జి.పద్మారావు ఫలితాలు విడుదల చేశారు. 6529 మంది పరీక్ష రాయగా, 3560 మంది ఉత్తీర్ణత సాధించారు. 54.53 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కోర్సుల 15 రోజుల్లోగా విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని డీన్ చెప్పారు.

ప్లాన్‌చేసి.. పట్టుబడి



- వ్యాపారి ఇంట్లో దోపిడీయత్నం కేసు ఛేదించిన పోలీసులు
- పన్నాగం పన్నింది తెలిసిన వ్యక్తే
- అప్పులు తీర్చేందుకు తప్పులు
- నలుగురు నిందితులకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద, పక్కన సీఐ పైడపునాయుడు

శ్రీకాకుళం క్రైమ్: ఇంటి వద్దనే కిరాణా షాపు నడుపుతున్న నగరానికి చెందిన ఒక వ్యాపారికి వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు సరిపోక అప్పులు చేశాడు. అనంతరం అప్పులోళ్ల బాధ ఎక్కువడంతో ఎలాగోలా డబ్బులు సంపాదించాలనే దుర్బుద్ధితో దోపిడీకి పన్నాగం పన్నాడు. ఒక లారీ డ్రైవర్ పరిచయంతో పక్క రాష్ట్రంలోని ముగ్గురు యువకులతో చేతులు కలిపి తనకు తెలిసిన కుటుంబాన్నే టార్గెట్ చేశాడు. ఏకకాలంలో ఆ ఇంట్లో కేజీ బంగారాన్ని కొట్టేయాలని స్కెచ్ వేశాడు. అయితే ఇంట్లోని మహిళలు తిరగబడడంతో పారిపోయారు. అనంతరం పోలీసులకు చిక్కి కటకటాలు పాలయ్యారు. నగరంలోని గూనపాలెం సమీప సబ్ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపిన వివరాల మేరకు...

గూనపాలెం ఎల్‌బీఎస్‌కాలనీ మొదటి లైన్‌లో నివసిస్తున్న వృద్ధుడైన పెద్దిన లక్ష్మణరావు వ్యాపార రీత్యా చితికిపోవడంతో అప్పులపాలై ఈజీగా డబ్బులు సంపాదించాలనుకున్నాడు. ఒకేసారి ఎక్కువ డబ్బులు రావాలంటే చోరీల ద్వారానే సాధ్యమనుకున్నాడు. ఈ క్రమంలో తెలంగాణ నుంచి మార్కెట్‌లోని హోల్‌సేల్ దుకాణాలకు అయిల్ ప్యాకెట్ల లోడులను దింపేందుకు వచ్చిన సజ్జు అలియాస్ కార్తీక్ లక్ష్మణరావుకు పరిచయమయ్యాడు. తెలిసిన కుర్రాళ్లెవరైనా ఉంటే పని ఇప్పిస్తానని లక్ష్మణరావు సజ్జుకు చెప్పడంతో భద్రాచలం సారపాక గ్రామానికి చెందిన యాకుబ్‌తో మాట్లాడించాడు. యాకుబ్ అతని మేనల్లుడైన సయ్యద్ ఇర్షద్ అలమ్(17)ను లక్ష్మణరావుకు పరిచయం చేశాడు.

ఇర్షద్‌ది నేర చరిత్రే

ఖమ్మంలోని ఓఎస్ఎస్‌బీ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న సయ్యద్ ఇర్షద్ మద్యానికి బానిసై చెడు తిరుగుళ్లకు అలవాటు పడి జల్సాలకు డబ్బులు సరిపోక సెల్‌ఫోన్లు, సైకిళ్లు వంటివి చోరీలు చేసేవాడు. ఇదే విషయంపై 2023లో ఇర్షద్ తండ్రి మందలించగా సుత్తితో తలపై కొట్టి అంతమొందించాడు. దీనిపై బూర్గంపహాడ్ పీఎస్‌లో కేసు నమోదవ్వడంతో మూడునెలలు జువైనల్ హోంలో ఉన్నాడు.

మిత్రులతో కలిసి

సయ్యద్ ఇర్షద్ గ్రామానికే చెందిన చిగురుపాటి ఆంజనేయులు అలియాస్ అంజి మనోడికి మిత్రుడు. అంజి చిలకలూరిపేటలో ఉన్న తన పిన్ని ఇంట్లో ఉంటూ వ్యవసాయ పనులు చూసుకోవడమే కాక, మద్యానికి, జల్సాలకు బానిసై స్వగ్రామమైన సారపాకలో చిల్లర దొంగతనాలు చేస్తుండేవాడు. ఇర్షద్, అంజిలకు నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం శానిపల్లి గ్రామానికి చెందిన మరో మిత్రుడు కూరాకుల భానూప్రసాద్‌కు కూడా ఇలాంటి వ్యసనాలే ఉండడంతో ముగ్గురూ జతకలిసి లక్ష్మణరావు చెప్పిన దోపిడీ పన్నాగ పనులకు తెరలేపారు.



వారం రోజుల క్రితం లక్ష్మణరావు ఇర్షద్‌కు ఫోన్ చేసి రమ్మనడంతో మిగతా మిత్రులతో కలిసి నగరంలోకి ప్రవేశించారు. లక్ష్మణరావు వేసిన పథకం ప్రకారం మొదటిగా ఉమెన్స్ కళాశాల దగ్గరలో ఉన్న ఇండియన్ బ్యాంకునందు చోరీకి యత్నించి జనాభా ఎక్కువగా ఉండడంతో భయపడి వెనుదిరిగారు. తర్వాత లక్ష్మణరావు తన ఇంటి దగ్గరలో ఉన్న ఓ మహిళ ఇంటికి ఆమె కుమార్తెల పెళ్లిళ్ల పేరుతో యువకులను పెళ్లి చూపులకు పంపించాడు. అనుమానమొచ్చి వాళ్లు కేకలు వేయడంతో యువకులు పారిపోయారు. ఇలా లాభం లేదనుకున్న లక్ష్మణరావు ముగ్గురికీ మూడు చాకులను ఇచ్చి తన ఇంటి దగ్గరలో ఉన్న కోరాడ గోవిందరావు వద్ద డబ్బులు, బంగారం ఎక్కువగా ఉందని వారి ఇల్లు, మార్కెట్లో ఉన్న దుకాణంలో దొంగతనాలు చేయాలని చెప్పాడు.

మహిళలు ప్రతిఘటించడంతో..

ఈ క్రమంలో ఈనెల 20వ తేదీన రాత్రి 10 గంటలకు మార్కెట్లో ఉన్న హోల్‌సేల్ దుకాణంలో డబ్బులు కొట్టేయాలని అనుకుని విఫలమయ్యారు. మరుసటి రోజు 21వ తేదీన సాయంత్రం 6 గంటలకు ఇంట్లో గోవిందరావు తల్లి మాత్రమే ఉంటుందని, వృద్ధురాలైన ఆవిడ ఒంటినిండా బంగారం ఉంటుందని, ఇంట్లో కూడా నగదు, బంగారం ఉంటుందని కాజేయడానికి వెళ్లారు. ఇద్దరు యువకులు ముందునుంచి, పెరడు నుంచి మరో యువకుడు చాకులతో వెళ్లారు. ఇంట్లోకి చొరబడిన వెంటనే గోవిందరావు తల్లి, భార్య, అన్న కుమారుడు ఉండడంతో యువకులు షాక్‌కు గురయ్యారు. అప్పటికే తమ వెంట తెచ్చుకున్న కత్తులతో బెదిరించి టేబుల్‌పై ఉన్న రూ.12 వేల నగదు తీసుకున్నారు. ఈలోగా గోవింద్ అన్న కుమారుడు ఇర్షద్‌ను అడ్డుకోవడంతో చాకుతో చేతిపై గాయం చేశాడు. అయినప్పటికీ మహిళలు వెరకుండా ఇంట్లో పనికి వాడుకున్న పెద్ద కత్తులను చూపించడంతో బెదిరిపోయిన దుండగులు చాకులు వదిలేసి పారిపోయారు.

పట్టుబడ్డారిలా..

ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడంతో అదేరోజు రాత్రి సీసీ ఫుటేజీ ఆధారంగా ఒక యువకుడు పట్టుబడ్డాడు. అనంతరం మరుసటి రోజు విచారణలో అనేక విషయాలు బయటపడడంతో పాటు వెహికల్స్‌ను ముమ్మరంగా తనిఖీ చేయడంతో నిందితులు నగరం విడిచి పారిపోకుండా ఉండిపోవాల్సివచ్చింది. సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయం సమీపాన ఉన్న డచ్ బంగ్లాలో దాక్కున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో సీఐ పైడపునాయుడు ఆధ్వర్యంలోని సిబ్బంది వెళ్లి పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.10 వేల నగదు, మూడు కత్తులు, మూడు సెల్‌ఫోన్లు, కటింగ్ బ్లేయర్, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మణరావుతో పాటు ముగ్గురు యువకులను మంగళవారం రిమాండ్‌కు తరలిస్తామని, లారీ డ్రైవర్ సజ్జు, అతని పరిచయస్తుడు యాకుబ్‌లను విచారించాల్సి ఉందని డీఎస్పీ వివేకానంద చెప్పారు. కేసును ఛేదించిన సీఐ పైడపునాయుడు, ఏఎస్ఐ రమేష్‌బాబు, హెచ్‌సీ బి.రవికుమార్, పీసీలు రవికుమార్, సూరిబాబు, దుర్గారావు, రమణమూర్తి, బుద్దేశ్వరరావు, గోపాల్‌లను ఎస్పీ మహేశ్వరరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



కవిటిలో వరి పనలను పరిశీలిస్తున్న అధికారులు

కవిటి: అకాల వర్షాలతో నష్టపోయన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కవిటి, పుటియదల, పుక్కలపాలేం తదితర ప్రాంతాల్లోని పంట పొలాలను ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ అనూష ఆధ్వర్యంలో అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అవకాశం ఉన్నంతవరకు వరి పనలను ఆరబెట్టుకోవాలని, ఉప్పునీటిని పిచికారీ చేయాలని సూచించారు. అయితే రైతులు మాట్లాడుతూ ఈ పరిస్థితుల్లో పంటని గట్లపై వేయడానికి అధిక ఖర్చు అవుతుందని, అయినా కూడా పంట చేతికి వస్తుందనే నమ్మకం లేదని వాపోయారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు జగన్మోహన్‌రావు మాట్లాడుతూ.. ఉన్నతాధికారులకు తెలియజేసి రైతులకు న్యాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సోంపేట వ్యవసాయ అధికారి బొర్ర నరసింహమూర్తి, కవిటి మండల వ్యవసాయ అధికారి బడగల దుర్గాప్రసాద్, వ్యవసాయ సహాయకుడు మాదిన పాల్గొన్నారు.

ఆదిత్యలో 'ఆవిష్కార్ హేక్‌తాన్'

టెక్కలి: సమాజంలో ఉన్న పలు సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను కనుగొనేందుకు దేశవ్యాప్తంగా ఆసక్తి గల ఇంజినీరింగ్ విద్యార్థులు ఒకచోట చేరి, 48 గంటల పాటు నిర్విరామంగా కృషి చేసేందుకు టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల వేదిక కానుందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈనెల 28 నుంచి 30 వరకు జాతీయ స్థాయి ఆవిష్కార్ (48 గంటల) హేక్‌తాన్ పోటీలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాలకు చెందిన 1,500 బృందాలు తమ పేర్లను నమోదు చేసుకోగా, వాటిని ఆన్‌లైన్ ద్వారా 5 రౌండ్లలో పరిశీలించి, చివరగా 70 బృందాలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. డిజిటల్ ఎంపవర్‌మెంట్ ఫర్ రూరల్ కమ్యూనిటీ, అర్బన్ మొబిలిటీ అండ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్, ఫుడ్ టెక్నాలజీ, మెడికల్ అండ్ హెల్త్, వేస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ రీ సైక్లింగ్, ట్రావెల్ అండ్ టూరిజం వంటి అంశాల్లో ప్రజలకున్న సమస్యలను గుర్తించి, వాటికి సాంకేతిక పరిష్కారాలు చూపుతూ ప్రాజెక్టులను రూపకల్పన చేస్తారన్నారు. విజేతలకు మొదటి బహుమతి కింద రూ.1.25 లక్షలు, రెండో బహుమతిగా రూ.1 లక్ష, మూడో బహుమతిగా రూ.75 వేలు అందజేస్తామని ప్రకటించారు.

కారు నడిపింది రాజేషట..?

- ఎమ్మెల్యే తనయుడి కారు ఢీ కొన్న ఘటనలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి
- ఎట్టకేలకు కేసు నమోదు చేసిన పోలీసులు



చెప్పల బోగయ్య(ఫైల్)

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం/పాతపట్నం: పాతపట్నం మండలం కొరసవాడలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తనయుడి కారు ఆటోను ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో గాయపడిన భామిని మండలం లివిరి గ్రామానికి చెందిన చెప్పల బోగయ్య(50) శ్రీకాకుళంలోని మెడికవర్ ఆస్పత్రిలో మూడు రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. బోగయ్య కుమారుడు మధు ఇచ్చిన స్టేట్‌మెట్ ఆధారంగా.. పోలీసులు ఆ కారును పల్లి రాజేష్ అనే వ్యక్తి డ్రైవ్ చేశాడని కేసు నమోదు చేశారు. దీంతో ప్రమాద సమయంలో డ్రైవింగ్ చేసింది ఎమ్మెల్యే కుమారుడు సాయి గణేషా? ఇంకొకరా? అన్న తర్జనభర్జనలకు తెరపడింది.

ప్రజల మనోభావాలు పట్టవా..?

- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



కాశీబుగ్గ: ప్రజల మనోభావాలు దృష్టిలో పెట్టుకుని శ్రీకాకుళంలో ఎయిర్‌పోర్టు నిర్మించాలని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఆయన మంగళవారం శ్రీకాకుళం జిల్లా పలాసలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇక్కడి ప్రజల ఆకాంక్షను ఆయనకు తెలిపి పోర్టు నిర్మాణం కోసం స్థలాలు గుర్తించామని గుర్తు చేశారు. ప్రభుత్వం మీద భారం తగ్గించాలనే ఉద్దేశంతో మూలపేటలో ల్యాండ్ గుర్తించి జగన్‌మోహన్‌రెడ్డిని ఒప్పించామని, కేవలం రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్లు భారంతోనే పనులు పూర్తికి అడుగులు వేశామన్నారు. ఉద్దానం నడిబొడ్డున రామంపురం పంచాయతీలో పచ్చని ఉద్యాన పంటల నడుమ ఎయిర్‌పోర్టు కట్టడానికి సన్నాహాలు చేస్తున్నారని, కనీసం ప్రజలకు ముందస్తు సమాచారం లేకుండా నోటిఫికేషన్ రిలీజ్ చేయడం ఏమిటన్నారు. స్థానిక ఎమ్మెల్యే దగ్గరకు ప్రజలు వెళితే 'మీకు ఇష్టం లేకపోతే వేరే చోటుకు ఈ ఎయిర్‌పోర్ట్ వెళ్లిపోతుందని ఇలా అడ్డుకోవడం మంచిది కాద'ని ఆమె అనడం బాగోలేదని కనీసం స్టడీ చేయకుండా ఎలా నిర్ణయాలు తీసుకుంటారని ప్రశ్నించారు. దీన్ని రాజకీయంగా చూడరాదని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకి, కూటమి ప్రభుత్వానికి సూచిస్తున్నామని చెప్పారు. పోర్టుకు అనుసంధానంగా తొమ్మిది వేల ఎకరాల భూమిని తయారు చేసి పెట్టామని తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి పంచాయతీ పరిధిలో సుమారు పద్దెనిమిది వందల యాభై ఎకరాల సాల్ట్ ల్యాండ్స్ కేంద్రం ఆధీనంలో ఉన్నాయని, అక్కడ పనులు చేసుకుంటే రెండు నుంచి మూడు రన్ వేలు నిర్మాణం చేసుకోవచ్చని అభిప్రాయపడ్డారు.

'నాపై విమర్శలు సరికావు'

తాను ఎన్నడూ హత్యా రాజకీయాలను ప్రోత్సహించలేదని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. పలాస నియోజకవర్గంలో బీహార్ గ్యాంగ్ సుపారీ కేసులో తన హస్తం ఉందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష విమర్శించడం సరికాదన్నారు. హత్యాయత్నం వంటి చరిత్ర ఏదైనా ఉందంటే అది సోంపేట, పలాస నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారికే ఉందని నర్మగర్భంగా మాట్లాడారు. అలాంటి సంఘటనలకు సంబంధించి పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని అన్నారు. ఒకప్పటి పీసీసీ నేత మజ్జి తులసీదాసు పైన ఆయన కుమారులపైన, ఆయన తండ్రి రామనాయుడుపైన, సుమ్మాదేవి రైల్వే గేట్ దగ్గర కృష్ణా జిల్లాకు చెందిన టీచర్ పైన ఇలా ఎంతోమంది పై హత్యాయత్నానికి ప్రయత్నాలు జరిగాయని గుర్తు చేశారు. 2018లో డోకి హరీష్ అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి కారణం ఎవరని ప్రశ్నించారు. ఇటీవల కాలంలో ఎస్సీలపైనే అట్రాసిటీ కేసులు నమోదు చేయడం, వైశ్య సామాజిక వర్గాలపై బెదిరింపులు చేయడం మూడు వారాల కిందట ఒక మహిళపై దాష్టీకాలు చేసిన రాష్ట్ర చైర్మన్ బాగోతం కూడా తన వద్ద ఉందని అన్నారు.


వినియోగదారుల హక్కులపై అవగాహన




మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వినియోగదారులు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. బాపూజీ కళామందిర్‌లో మంగళవారం వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌర సరఫరాల శాఖ సంయుక్తంగా జాతీయ వినియోగదారుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆమదాలవలస శాసనసభ్యులు కూన రవికుమార్ హాజరయ్యారు. కార్యక్రమానికి జిల్లా వినియోగదారుల సంఘం చైర్మన్ బగాది రామ్మోహన్ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వినియోగదారులకు నష్టం జరిగితే సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆమదాలవలస శాసనసభ్యులు కూన రవికుమార్ మాట్లాడుతూ వినియోగదారునికి కొన్ని హక్కులున్నాయని వాటిని ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి జి.సూర్యప్రకాష్ మాట్లాడుతూ వినియోగదారులు ఎక్కడైనా మోసపోతే మండల కేంద్రంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బి.మీనాక్షి, డీసీహెచ్ఎస్ డాక్టర్ కల్యాణ్ బాబు, జీఎస్టీ సహాయ కమిషనర్ రాణి మోహన్, గంజి ఆర్ ఎజ్రా పాల్గొన్నారు.

● రైతుకంట కన్నీరు..!



కొత్తూరు: గొట్టిపల్లిలో నేలకొరిగిన వరిపంట



నరసన్నపేట: బొరిగివలసలో పొలంలో కుళ్లిన వరి దుబ్బులు

ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురవడంతో వరిపంట, కోతకోసిన పనలు, కల్లాల్లోని కుప్పలు తడిచిపోయాయి. దీంతో తేమ శాతం పెరిగి రంగు మారే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మంగళవారం నుంచి మరలా వాతావరణంలో మార్పులు రావడంతో మరింత నష్టం తప్పదని వాపోతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు. – సాక్షి నెట్‌వర్క్

రైతులకు భరోసా కల్పించాలి

- ఎమ్మెల్సీ నర్తు రామారావు




మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం రూరల్: అకాల వర్షాలకు అతలాకుతలమైన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన భరోసా కల్పించాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికీ వందలాది ఎకరాల పంట పొలాలు నీటిలోనే ఉన్నాయని, రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఎటువంటి హామీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు గత నాలుగు రోజులుగా జిల్లా రైతులు అవస్థలు పడుతున్నా తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రంగు మారిన ప్రతీ ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతుల జాబితాను తయారు చేసి, ఒక్కో బాధిత రైతుకు ఎకరాకు రూ.40 వేలు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- దిశ సమీక్షలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరులు

అరసవల్లి: కేంద్ర ప్రభుత్వం నుంచి అనేక పథకాలు సబ్సిడీలతో అమలవుతున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమీక్షలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులంతా బాధ్యతగా విజన్‌తో కూడిన ప్రణాళికలు రూపొందించాలని కోరారు. ఆ ప్రణాళికల అమలుతో జిల్లాలో భవిష్యత్ తరాలు కూడా మంచి ఫలితాలు పొందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

వివిధ శాఖలపై సమీక్ష

అనంతరం ఉపాధి హామీ, ఆర్‌డబ్ల్యూఎస్, జల్‌జీవన్ మిషన్, పీఎం ఆవాస్ యోజన, డీఆర్‌డీఏ తదితర శాఖల ప్రగతిపై, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఎలాంటి ముందు చూపు లేకుండా పరిపాలన చేసిందన్నారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ నిధులతో ఉద్దానం ప్రాంతంలో గత ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీకాకుళం, నరసన్నపేట, పలాస, ఆమదాలవలస ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, కూన రవికుమార్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

అంతా తానై వ్యవహరించిన 'కూన'

దిశ సమీక్ష చేసేందుకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ దినకర్, విప్ అశోక్ తదితరులు వేదికపైన ఉన్నప్పటికీ ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అంతా తానై వ్యవహరించారు. అసలు కేంద్రమంత్రి, చైర్మన్ దినకర్‌లు ఒకేసారి సమీక్షించడం తగదని చెప్పేశారు. ఇకముందు అలా కాకుండా వేర్వేరుగా సమీక్షించాలని, లేదంటే అధికారులపై తీవ్ర ఒత్తిడి ఉంటుందన్నారు. అలాగే జల్‌జీవన్ మిషన్, ఇళ్ల కేటాయింపులు తదితర శాఖలతో సమీక్షల్లో కూడా తనదైన శైలిలో కూన రవి పూర్తి ఆధిపత్యధోరణి చూపించారు. దీంతో వేదికమీద ఉన్న కేంద్రమంత్రితో పాటు అతిథిగా వచ్చిన దినకర్ కూడా మిన్నకుండిపోవాల్సి వచ్చింది.